క్లుప్తంగా

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రచారం

గంగవరం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మండలంలో ఎన్నికల ప్రచారంలో బుధవారం సాయంత్రం 3గంటల నుంచి పాల్గొంటారని పార్టీ నాయకుడు తోట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ తెలిపారు. మండలంలోని భయ్యనపల్లి, పాతరామవరం, ఉమ్మెత్తి, రాజవరం-1, రాజవరం-2, జియ్యంపాలెం, జగ్గంపాలెం, ఓజుబంద గ్రామాల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, హాజరుకావాలని కోరారు.

ఏపీఎండీసీ ఉద్యోగి మృతికి సంతాపం


కిల్లో ఒన్నాది (ఫైల్)

అరకులోయ రూరల్: మండలంలో చినలబుడు పంచాయతీ హటగుడ గ్రామానికి చెందిన ఏపీఎండీసీ ఉద్యోగి కిల్లో ఒన్నాది(45) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు రఘు, నర్సింగ్ తదితరులు ఒన్నాది మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సన్యాసినాయుడు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివార్లలోని కింద్ర జంక్షన్ వద్ద సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. గూడ్సు వాహనాల్లో సరకులను క్షుణ్ణంగా పరిశీలించి వదిలిపెట్టారు. వాహనదారుల రికార్డులు పరిశీలించి, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం వంటి రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేస్తున్నట్టు సీఐ సన్యాసినాయుడు విలేకరులకు తెలిపారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఐ వెంకయ్య, సిబ్బంది ఉన్నారు.

జీడితోట దగ్ధం


దగ్ధమైన జీడితోట

కొయ్యూరు: కాస్తున్న ఎండలకు జీడితోటలు కాలిపోతున్నాయి. మంగళవారం దొడ్డవరానికి చెందిన కనిగిరి రాజుబాబుకు చెందిన రెండు ఎకరాల జీడితోట పూర్తిగా కాలిపోయింది. జీడితోట దగ్ధమవడంతో జీవనాధారం కోల్పోయానని బాధిత రైతు రాజుబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇదిలా ఉండగా పలువురు పర్యావరణ వేత్తలు మాట్లాడుతూ పొగ తాగేవారు అగ్గిపుల్లలను పూర్తిగా ఆరకుండా పడవేస్తుండడంతో పాటు కొన్ని పరిస్థితుల్లో కాలిపడేసిన బీడీలు, సిగరెట్లు, చుట్టల వల్ల ఎండిన ఆకులు వెంటనే రాజుకుంటున్నాయని చెబుతున్నారు. ఈ కారణంగా విలువైన తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎంపీ అభ్యర్థి తనూజరాణి ఎన్నికల ప్రచారం

రాజవొమ్మంగి: వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి బుధవారం సాయంకాలం 3 గంటల నుంచి రాజవొమ్మంగి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఆమెతో పాటు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ కూడా పాల్గొంటారని మండల పార్టీ కమిటీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మండలంలోని నెల్లిమెట్ల కాలనీ, లబ్బర్తి, లాగరాయి, కింద్ర, కొత్తకింద్ర, కిర్రాబు, తాళ్లపాలెంలలో పర్యటిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటి సభ్యులు కోరారు.

రైతుల్లో 'ధర'హాసం


సంతకు తరలిస్తున్న పసుపు బస్తాలు

- వ్యవసాయ పంటలకు గిట్టుబాటు
- పెరిగిన పసుపు, మిరియాల ధరలు

జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల ధరలు వారపు సంతల్లో పెరుగుతుండడంతో రైతుల కళ్లలో ఆనందం వ్యక్తమవుతుంది. గతంలో వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వారపుసంతల్లో మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులకు ఊరట కలిగింది. ఏజెన్సీ ప్రాంతాల్లో వారం రోజు పాలు ఏదోక చోట వారపు సంత జరుగుతుంది. ఈ వారపు సంతలే గిరిజనులకు మార్కెట్‌లుగా ఉన్నాయి. గిరిజనులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులు వారపు సంతలకు తరలించి విక్రయిస్తుంటారు. మండలంలో జి.మాడుగుల సంతబయలు గ్రామంలో గత మంగళవారం జరిగిన వారపు సంతలో మిరియాలు హైబ్రిడ్, దేశవాళీ(ఆర్గానిక్) కిలో రూ.470 విక్రయించగా, ఈ వారం రూ.500 నుంచి రూ.510వరకు ధర పలికింది. అదే విధంగా గత వారం పసుపు కిలో రూ.110 ఉండగా, ఈ వారం రూ.130ధర పలికింది. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం ప్రారంభంలో కిలో పిప్పలి ధర రూ.270 నుంచి రూ.280ఉంది. గిరిజన ప్రాంతాల్లో వాణిజ్య పంటలకు ప్రతీ వారం ధర పెరుగుతుండడంతో ఈ సంవత్సరం తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


శుద్ధి చేసిన మిరియాలు

మండలంలో వివిధ పంటల విస్తీర్ణం

పంట	విస్తీర్ణం	సాధారణ దిగుబడి	రైతులు
మిరియాలు	5వేలు ఎకరాలు	30 మెట్రిక్ టన్నులు	3,000
కాఫీ	35 వేల ఎకరాలు	250 మెట్రిక్ టన్నులు	4,000
పిప్పళ్లు	600 ఎకరాలు	50 మెట్రిక్ టన్నులు	400

సంతోషంగా ఉంది



ఏజెన్సీలో వ్యవసాయ పంటల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పసుపు, మిరియాలు ధరలు ప్రతి వారపు సంతల్లో ధరలు పెరుగుతున్నాయి. పిప్పళ్లు గత సంవత్సరంలో ప్రారంభ ధర మాదిరిగానే ఈ ఏడాది కూడా అదే ప్రారంభ ధర పలుకుతుంది. పసుపు కిలో రూ.20 మిరియాలు కిలో రూ.30 ధరలు పెరగటంతో సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో మరింతగా మార్కెట్ పెరుగుతుందని ఆశిస్తున్నాం.

– చిరంజీవి, రైతు, ఎస్.పెదబయలు, జి.మాడుగుల

లాభసాటి వ్యాపారం



గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న వారపు సంతల్లో వ్యవసాయ వాణిజ్య పంటలు ప్రారంభ ధరలు గిట్టుబాట అవుతున్నాయి. పసుపు, పిప్పళ్లు, మిరియాలు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాను, ధరలు పెరిగితే రైతుకు లాభసాటిగా ఉంటుంది. మన్యం మిరియాలు, పసుపునకు గిరాకీ ఉంది.

– రాజుబాబు, రైతు, గడుతూరు, జి.మాడుగుల

వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నేడు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో బుధవారం మండల వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణిలతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు పార్టీ పరిశీలకులు శోభా హైమావతిలు హాజరవుతారని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

పెదబయలు: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కేడర్ సమావేశం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు తెలిపారు.అరకు అసెంబ్లీ పరిశీలకురాలు శోభ హైమావతి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు మండల పార్టీ కేడర్ సమావేశం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ కేడర్‌ను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరుగుతుందని జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా, అరకు, ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా పార్టీ పెద్దలు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసిలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

అమ్మవారి జాతరకు విరాళాలు


విరాళాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్తుల

చింతపల్లిరూరల్: మే నెల 5 నుంచి 8వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరగనున్న ముత్యాలమ్మ తల్లి జాతరకు విరాళాల సేకరణ ఉగాది పర్వదినం మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక సిమెంట్ వ్యాపారి దుర్గా నగేష్‌తో విరాళాల సేకరణ మొదలైంది.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముత్యాలమ్మ తల్లి జాతరను ఈ ఏడాది అతి వైభవంగా నిర్వహిస్తామని, యువత ఉత్సవ నిర్వాహణలో కీలకపాత్ర తీసుకోవాలని సూచించారు. జాతరను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు, అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, కమిటీ అధ్యక్షుడు పసుపులేటి వినాయకరావు, సభ్యులు రమణమూర్తి, వీరేంద్ర, వీరన్నపడాల్, పద్మనాభం, తాటిపాకల బ్రదర్స్, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఠారెత్తించిన ఎండ


రాజవొమ్మంగిలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

రాజవొమ్మంగి: మండల పరిసరాల్లో మంగళవారం ఎండలు బెంబేలెత్తించాయి. ఉదయం 10 గంటల నుంచి సూరీడు తన ప్రతాపాన్ని చూపాడు. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మరింత పెరిగింది. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడ్డారు. వేడి గాలులు వీచాయి. మూగజీవాలు చెట్ల నీడన సేదతీరాయి. సాయంత్రం 6 గంటల తరువాత వాతావరణ కాస్త చల్లబడడంతో మండలవాసులు ఉపశమనం పొందారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం


గిరిజనులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు


దాబుగుడలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నేతలు

చింతపల్లిరూరల్: మీ చల్లని ఆశీసులు ఎల్లప్పుడు వైఎస్సార్‌సీపీపై ఉండాలని పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో అన్నవరం పంచాయతీ నేరోడివీధి, కొత్తూరుబయలు, గాలిపాడు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామస్తులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ చల్లని ఆశీస్సులను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీకి మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రదాత అయిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న మాత్రమే మన గిరిజనుల బాగుకోరే మనిషి అని, మరే ఏ నాయకుడు మన బాధలు అర్థం చేసుకోలేరన్నారు.అభివృద్ధిలో గాని, సంక్షేమ పథకాలు అందించడంలోగాని జగనన్నకు ఎవరు సాటి రాలేరన్నారు. మరలా జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే మన గ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా తనూజారాణిని, ఎమ్మెల్యేగా అభ్యర్థిని మత్స్యరాస విశ్వేశ్వరరాజు అయిన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు.జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, నూర్మతి మత్యకొండం నాయుడు, సర్పంచ్‌లు సలీమితి లక్ష్మయ్య, కిముడు రాంబాబు, జి.మాడుగుల వైస్ ఎంపీపీ సత్యానారాయణ, జిల్లా పార్టీ కార్యదర్శి గిరిప్రసాద్, నాయకులు కృష్ణ, సుధాకర్, బాబూరావు, గంగన్న పడాల్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలని సుంకరమెట్ట పంచాయతీ దండబాబు, దాబుగుడ, సంగంవలస గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల నుంచి వస్తున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీల మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్, మహిళ అధ్యక్షురాలు సుమిత్ర, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొర్రా గాసీ, ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు రంజిత్‌కుమార్, అప్పలస్వామి, కన్వీనర్లు గణేష్, తిరుపతి, నాయకులు బాలరాజు,నర్సింగ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ (అరకులోయటౌన్): మండలంలోని కొర్రా పంచాయతీ పెదపాడ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మేము సిద్ధం...మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరిజన ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. శివారు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, సంక్షేమ పాలనను కొనసాగించేందుకు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగను గెలిపించాలని కోరారు. సర్పంచ్ అర్జున్, జేసీఎస్ కన్వీనర్ గణపతి, నాయకులు పాపారావు, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యురాలు మినుముల పార్వతమ్మ ఆధ్వర్యంలో మేము సిద్ధం ..మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు పార్వతమ్మ మాట్లాడుతూ గడప వద్దకే ప్రభుత్వ సేవలందించి సుపరిపాలన అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. గిరిజన గ్రామాల్లో ఎన్నడులేని విధంగా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటి పనులు జరిగాయన్నారు.గిరజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగును గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ బంగారమ్మ, నాయకుడు అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెదపాడులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న నాయకుడు మల్లేశ్వరరావు


బాబుశాలలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ బంగారమ్మ, ఎంపీటీసీ పార్వతమ్మ, నేతలు

ఘనంగా ఉగాది వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులతో కళకళలాడిన అమ్మవార్ల ఆలయాలు


గడుగుపల్లిలో సత్యసాయి సేవామృత నిలయంలో పూజలు చేస్తున్న భక్తులు


అడ్డతీగలలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: తెలుగు ప్రజల నూతన సంవత్సర పర్వదినం ఉగాదిని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. క్రోధినామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించారు. కొత్త దుస్తులు ధరించి, ఇంటిల్లి పాది కలిసి షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేశారు. దీపదీపాలు, పండ్లు, పూలతో పూజల అనంతరం ప్రసాదం, అల్పాహారం అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు. ఇరుగుపొరుగు వారికి పంచిపెట్టారు. పిల్లలు ,పెద్దలు నూతన వస్త్రాలు ధరించి సమీప ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఈ ఏడాది పంటలు బాగా పండి అన్ని విధాలా బాగుండాలని, దుష్ట శక్తుల బారి నుంచి కాపాడాలని, అందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని కాంక్షిస్తూ అమ్మవారిని వేడుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. రాశి, ఫలాలను వివరించారు. పలుచోట్ల ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

రైతుల పండుగ: రైతులు తమ పశువుల కొట్టాలను శుభ్రపరిచారు. సాగులో చేదోడు వాడోడుగా వుండే పశుసంతతిని చెరువుకు తీసుకొని వెళ్లి కడిగారు. వ్యవసాయ పనిముట్లకు పసుపు కుంకుమలు అద్ది ఈ ఏడాది అంతా బాగా జరగాలని, పాడి పంట కలగాలని కోరుకొంటు పూజలు చేశారు. ఏరువాక సాగి తమ పొలాల్లో తొలిసారిగా దుక్కులు దున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకొన్నారు. మండల కేంద్రంలో ఉగాదిని పురస్కరించుకొని వ్యాపారులు జీడిమామిడి పిక్కల దుకాణాలు ప్రారంభించారు. మరికొంత మంది నూతన వ్యాపార లావాదేవీలను ప్రారంభించారు.

వీఆర్ పురం: మండలంలోని ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గున్నంకొండ ముత్యాలమ్మ , గంగనమ్మ అమ్మవారుల జాతర వైభవంగా జరిగింది. మండల పరిధిలోని శబరి నది ఒడ్డున కొండ మీద వెలసిన ముత్యాలమ్మ,కొండ కింద గుహలో కొలువు దీరన గంగానమ్మ అమ్మవారులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. . వీఆర్ పురం సంతపాకల ముత్యాలమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించున్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయం, ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు మండలంలోని పలు ఆలయాలు, గడుగుపల్లిలో శ్రీ సత్యసాయి సేవామృత సేవ నిలయంలో ఉగాది పండగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపారు.

పెదబయలు: మండలంలోని సీతగుంట, పెదబయలు భీమలింగేశ్వర స్వామి ఆలయం, మోదకొండమ్మ తల్లి, పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం జరిగింది.

ముంచంగిపుట్టు: మండంలోని పలు గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ క్రోధినామ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

అడ్డతీగల: అడ్డతీగల నుంచి ఏలేశ్వరం వెళ్లే ప్రధాన రహదారిలో బందంవారిపాకలు వద్ద వేంచేసిన బోడకొండమ్మ ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు నెరవేర్చే కల్పవల్లిగా పేరుగాంచిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ బాలాజీ బాబు చెప్పారు. భారీ అన్నసమారాధన నిర్వహించినట్టు తెలిపారు.

కూనవరం: మండలంలోని మర్రిగూడెంలో కొలువుదీరిన శ్రీదేవీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కళకళలాడింది. ఆలయం సమీపంలో జాతర నిర్వహించారు. చిన్నారులు, యువత సందడి చేశారు.


సంతపాకలలో ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


రాజవొమ్మంగి షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు


మర్రిగూడెంలో ముత్యాలమ్మ ఆలయం వద్ద జాతరలో గ్రామస్తులు

ఘనంగా నూకాంబిక ఉత్సవాలు

కశింకోట: స్థానిక స్వయంభూ నూకాంబిక ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య ఉత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. భక్తులు తల నీలాలు, చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గంప జాతరలు జరిపి, కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపారు. వరుసగా మూడో రోజు కూడా మహిళల భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసింగబిల్లిలో నూకాంబిక ఉత్సవాల్లో భాగంగా పోతురాజుబాబు జాతర నిర్వహించారు. పలువురు నేల వేషాలతో వీధుల్లో సందడి చేశారు. నరసింగబిల్లి, చింతలపాలెం గ్రామాల్లో జాతర ఊరేగింపు నిర్వహించారు. కమిటీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతలగుంటపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం , గొబ్బూరు, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లోని నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో కూడా విశేష పూజలు జరిగాయి.

జనన ధ్రువీకరణ పత్రాల పంపిణీ నేడు

గంగవరం : స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన తెలిపారు. 2016 నుంచి ఇప్పటి వరకు గంగవరం పీహెచ్‌సీలో జన్మించిన వారు ఇంకా జనన ధ్రువీకరణ పత్రం తీసుకోకుంటే ఆ శిబిరంలో అందజేస్తారన్నారు. ఆధార్ అప్‌డేషన్, కొత్త ఎన్‌రోల్‌మెంట్, పోస్టల్ బ్యాంక్ ఖాతాల ఆధార్‌తో లింక్ తదితర సేవలను అందజేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ


మృత్యుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: మండలంలో గల వనుగుమ్మ పంచాయతీ కిరాంబో గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన మృతుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, నాయకులు మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మృతుడి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ విషాదకరమైన ఘటన అందరిని కలిచి వేసిందని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ప్రమాదంలో స్వల్పంగా గాయాలైన వారిని సైతం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా పాంగి పద్మారావు మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు మృతుల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశామన్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, జేసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ జగబంధు, మండల జేసిఎస్ కన్వీనర్ కొండలరావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు గాసిరావు, దాసు, రామకృష్ణ, జగన్నాథంపడాల్, బుద్ద తదితరులు పాల్గొన్నారు.